: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 33 | 23-05-2022 | పుటలు : 4


## పరిశోధనలలో నాణ్యత పెరగాలి



**18.05.22 (మీడియా సెల్)** పరిశోధనలలో నాణ్యత పెరగాలని, సమాజానికి ఉపయోగపడే విధంగా నూతన విషయాలను వెలుగులోనికి తీసుకురావాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో బుధవారం పరిశోధక విద్యార్థులతో వీసీ సమావేశమయ్యారు. ఆయా విభాగాలలో పరిశోధనలు చేస్తున్న విద్యార్థుల పరిశోధన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రీ పి,హెచ్.డి పరీక్షలు, పరిశోధన విధానాలపై ఆరా తీసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన విషయాలను సమాజానికి అందించే విధంగా పరిశోధనలు రావాలని అన్నారు. కొత్త విషయాలు లేని పరిశోధనలతో సమాజానికి ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్నారు. గైడ్ లు విద్యార్థులకు మార్గదర్శిగా ఉంటూ పరిశోధన ప్రమాణాలను అవలంబిస్తూ మంచి పరిశోధనలను అందించాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థులంతా నాణ్యమైన పరిశోధనలు చేయాలన్నారు. పరిశోధనలకు విశ్వవిద్యాలయం పెద్దపీట వేస్తుందని, విశ్వవిద్యాలయ లైబ్రరీ, జెస్టోర్, జెగేట్ సేవలను,నన్నయభారతి డొనేటెడ్ వింగ్ ను పూర్తిగా వినియోగించుకోవాలని తెలియజేసారు. వివరణాత్మక, తులనాత్మక పరిశోధన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. పరిశోధన విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావలన్నా తనను సంప్రదించవచ్చునని తెలియజేసారు. త్వరలో గైడ్ లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు. విద్యార్థులంతా పరిశోధనలపై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించాలని త్వరితగతిన పరిశోధనలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ పాల్గొన్నారు.

## డాన్స్ డే వీడియో ప్రోమోను ఆవిష్కరించిన వీసీ



**17.05.22 (మీడియా సెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లో నిర్వహించిన అంతర్జాతీయ నృత్య దినోత్సవ కార్యక్రమ వీడియో ప్రోమోను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. యూనివర్సిటీలో మంగళవారం డాన్స్ డే వీడియో సిడిలను ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేస్తారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ నృత్య దినోత్సవ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్యం, పేరిణి శివతాండవం, జానపదం, కోలాటం, వెస్టన్, జుగల్బందీ వంటి ప్రదర్శనలను వంద మంది కళాకారులు ప్రదర్శించారని చెప్పారు. ఈ ప్రదర్శనలను వీడియో రూపంలో చిత్రీకరించామని, వీటిని యూనివర్సిటీ వెబ్సైట్ మరియు నన్నయ న్యూస్ టీవీలలో అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర సాంస్కృతిక శాఖలకు పంపిస్తామన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం సంస్కృతికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే విధంగా వీడియో రూపొందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలను విశ్వవిద్యాలయం తరపున నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రోగ్రాం కన్వీనర్ శ్రీరాజేశ్వరిదేవి పాల్గొన్నారు.


## ఫిజిక్స్ ఫ్రెషర్స్ పార్టీ




















# సంపాదకీయం



## అన్నమయకోశం

సర్వ జగన్మంగళకర దీక్షం,సకల మనుజ కుల కృపాకటాక్షం శ్రీవిశ్వనాథం భజే! అంటారు శ్రీ ముత్తుస్వామి దీక్షితులు. సంగీత సాహిత్యాలకు సమప్రాధాన్యమిచ్చి తన చుట్టూ ఉన్న ప్రపంచం కోసం ప్రజల బాణీలో తన వాణిని వినిపించిన వాగ్గేయకారుడు అన్నమయ్య.

ఆయన కీర్తనలు కేవలం భక్తి రస ప్రవాహాలే కాదు, జ్ఞానామృత ధారలు కూడా. అసలు ఈ గాలి, ఈ నేల, ఈ నీరు అణువణువునా నాదమయమై ప్రణవనాదంలో లీనమయ్యే ఒకానొక సంగీత వృత్తి వాగ్గేయకార ప్రవృత్తి! అది మరి ఏ భాషకు సాధ్యం కానిది.మరే సంస్కృతిలో లేనిది. వాగర్థ ప్రతిపత్తి అన్నదానికి రుజువుగా శబ్దార్థ సమ్మిళితంగా అసలు లోకానికి మార్గదర్శనం చేసినది ఆదిశంకరులు. అది అద్వైత సిద్ధాంతమైనా సంగీత సమన్వితం. అందుకే ఇది మనకు అనుశృతంగా వస్తున్న సంగీతంతో ముడిపడిన, మనకే సొంతమైన ప్రవృత్తి.

సంగీతమపి సాహిత్యం... అని కదా శ్లోకం.ఒకటి ఆనందామృతం. తక్కినది ఆలోచనామృతం.ఆనందాలోచనామృతాల రస ప్రపంచంలో తేలియాడే అన్నమయ్య సంగీత నందనోద్యానం - ఒక సుందర బృందావనం!

ఆద్యంతం మానవీయతను ఆకళింపు చేసుకుని సమసమాజ నిర్మాణం కోసం కలం,గళం ఉపయోగించుకున్న సంస్కర్త, సంకీర్తనాచార్యుడు. అన్నమయకోశంలో ఆనందాన్ని, అందాన్ని నింపుకున్నవాడు అన్నమయ్య. ఆ అన్నమయ కోశంలోంచి కొన్ని వేల రసానంద మకరందాల్ని సాదరంగా మనకందించాడు.

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే అతడైన భగవంతుడు అందింపజేశాడు. కొండంత మానవతావాదాన్ని ఈ సమాజానికి అందించటానికి అన్నమయ్యను పంపించాడు కొండలలో నెలకొన్న కోనేటి రాయడు. అసమానతల్ని ఖడ్గంతో చీల్చటానికి పుట్టించాడు. దినమహూరాత్రములు ధనికులకు, దరిద్రులకు ఒక్కటే! అని అనిపించాడు.వ్యక్తిగతమైన భావోద్వేగాల తీవ్రతను సార్వజనీనం చేయటానికే అన్నమయ్య పదకవితలల్లాడు.

పవిత్రమైన అశ్వత్థవృక్షం కాకి వలన, ముత్యపుచిప్పలోంచి ముత్యాలు,చిదిపిరాళ్ళలోంచి వజ్రాలు,ఈగల వలన తేనె, జవ్వాది పిల్లి నుంచి కస్తూరి పడుతున్నాయి కదా! భగవంతుని కొలిచే భక్తులంతా సమానమే. సామాజిక సమతా భావాన్ని అన్నమయ్య తన సంకీర్తనలలో వ్యక్తం చేశాడు.


అన్నమయ్యది సంస్కరణతో కూడిన తన్మయత్వం. కీర్తన - శ్రవణం - ఆనందామృతం! సంస్కరణ - సాహిత్యం - ఆలోచనామృతం!!

సంగీత సంస్కారమంతా అన్నమయ్య పుట్టుకతో అందుకున్న ఆస్తి. జీవితమంతా పైపై వేషాలతో కాక, లోతైన భావాలతో, భక్తితో ఆదర్శప్రాయంగా గడుపుకున్నాడు. గడపాలన్నాడు. చదువుట మేలు విచారించుట కొరకే... అన్నది ఆయన చదివిన చదువులు పరమార్థం.తన నాటికే విలువలు క్షీణిస్తున్న చదువుల్ని నిలదీశాడు.

ప్రవృత్తిలో నివృత్తిని, బ్రతుకులో పరమార్థాన్ని, కనిపించే అన్నింటిలో అంతర్యామిని, ఆచరించి అనుభవించిన దానిలోంచే ఉపదేశాన్ని అందించిన అన్నమయ్య నిజమైన "ఆచార్యుడు". సంకీర్తనాచార్యుడు.

ఆరుద్రగారు అన్నట్లుగా... అన్నమయ్య "అనుభవ సముద్రుడు"

# శంకరనారాయణ నిఘంటువు





## పుస్తకం



శ్రీ పాలూరి శంకరనారాయణ శ్రీకాకుళంలో జన్మించారు. అక్కడే ఉన్నత పాఠశాలలో చదివి కొంతకాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారు.సొంతూరు నెల్లూరు అయినప్పటికీ మద్రాసులో స్థిరపడ్డారు. తండ్రి రామానుజం శెట్టి నుండి ఇంగ్లీష్ నేర్చుకున్నారు.తండ్రిలాగానే దుబాసీ (అనువాదకులు) అయ్యారు. తెలుగు, సంస్కృతంలో కూడా మంచి పరిజ్ఞానం సంపాదించి సంస్కృతాంధ్ర పండితుడు అనిపించుకున్నారు. కొంతకాలం విజయనగరం మహారాజు,జయపురం మహారాజు, పిఠాపురం రాజా, నూజివీడు జమీందారుల కుటుంబాల పిల్లలకు ఇంగ్లీషు చదువులు చెప్పారు. తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత అధ్యాపకుని గాను, మద్రాసు విశ్వవిద్యాలయంలో పరీక్షాధికారిగానూ పని చేశారు. మహారాజుల కుటుంబాలకు చదువులు చెబుతున్న రోజుల్లోనే వారి కోసం ఇంగ్లీష్ పదాలు, వాటికి తెలుగు అర్థాలు జాబితాలు తయారు చేసుకున్నారు. తరువాత దానిని వ్యవస్థీకరించి ఇంగ్లీషు,తెలుగు నిఘంటువుగా తయారు చేశారు.ఇలా క్రమంగా ఆయన తయారు చేసిన నిఘంటువు మొదటిసారిగా 1897లో మద్రాసులో ప్రచురింపబడింది. దాని పేరే "శంకరనారాయణ ఇంగ్లీష్-తెలుగు నిఘంటువు" ఆయన జీవించి ఉండగానే ఐదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలు తొడయ్యాయి.ఈ నిఘంటువు ప్రసిద్ధికెక్కి 125 సంవత్సరాలు పైగా తెలుగు వారందరికీ ప్రామాణికంగా నిలిచింది.శంకరనారాయణ గారు 1924-25 ప్రాంతంలో కాలధర్మాన్ని పొందారు. విద్యార్థులకు, తెలుగు ప్రజలకు గొప్ప నిఘంటువును అందించిన శంకర నారాయణ గారికి నన్నయవాణి భక్తి నీరాజనం సమర్పిస్తోంది.




# తెలుగు ఫ్రెషర్స్ పార్టీ














ప్రతిభావాణి

# 'మహాకవి' దాసు శ్రీరాములు




ఆధునిక కాలంలో 'మహాకవి' గా పేరుకెక్కిన అతి తక్కువమంది మనీషామూర్తులలో దాసు శ్రీరాములు తొలి తరం వారు. వారు కేవలం మహాకవి మాత్రమే కాదు,వాగ్గేయకారులు, బహురంగాలలో ప్రవీణుడు.బహుముఖ ప్రముఖులు. ఆ కాలంలో వీరినెరగని తెలుగు ప్రముఖులు లేనే లేరు. ప్రతిభ, ప్రాభవం కలిగిన దాసు శ్రీరాములు 1846లో ఏప్రిల్ 8 వ తేదీన కృష్ణాజిల్లా కూరాడ గ్రామంలో జన్మించారు.1908 లో తన 62వ ఏట మరణించారు.న్యాయవాదిగా మచిలీపట్నంలో ప్రాక్టీస్ ప్రారంభించి, తర్వాత ఏలూరులో సుదీర్ఘకాలం ఆ వృత్తిలో ప్రముఖులుగా రాణించారు. బాలమేధావి, బహుమేధావి అనే మాటలు వీరికి అక్షరాలా సరిపోతాయి. చిన్న వయస్సులో గురుముఖతా విద్యాభ్యాసం సాగినా, ఎక్కువ జ్ఞానం స్వయంకృషితో సాధించినదే. బాల్యంలోనే సంస్కృతాంధ్ర భాషలు నేర్చుకొని 12వ ఏటనే నూజివీడు సంస్థానంలో అష్టావధానం చేశారు. అదే ఈడులో, 'సోమలింగేశ్వర శతకం' రాశారు. కేవలం 14 ఏళ్ళ ప్రాయంలోనే 'సాత్రాజితి విలాసం' అనే యక్షగానం రచించి అందరినీ అమితాశ్చర్యంలో ముంచెత్తారు. ఇరవై ఏళ్ళ ప్రాయంలోనే తర్క, వ్యాకరణ, సంగీత, సాహిత్య, వేదాంతాలలో పాండిత్యం గడించారు. ఇంగ్లిష్ భాషలోనూ పరిణతి పొంది, న్యాయశాస్త్ర పట్టా కూడా పొందారు. కొంతకాలం గుడివాడలో ఇంగ్లిష్ టీచర్ గా ఎందరికో భాషాసాహిత్యాలు బోధించారు. చిన్న వయస్సులోనే గొప్ప అధ్యాపకుడిగా పేరు తెచ్చుకున్నారు.న్యాయవాద వృత్తిలో ఉన్నంతకాలం న్యాయం, ధర్మంవైపే నిలుచున్నారు. మహిళలు, పేదలు, సామాన్యులు పక్షాన నిలబడి, న్యాయాన్ని నిలబెట్టిన పరమ ఆదర్శ న్యాయవాది. స్త్రీపక్షపాతిగా జీవితాంతం మహిళామణుల అభ్యున్నతికి అంకితమయ్యారు. సంగీత, సాహిత్యాలు ఒక వంక, న్యాయవాద వృత్తి మరొక వంక, సంఘసంస్కరణ ఇంకొక వంకగా త్రినేత్రులై విజృంభించారు.స్వయంగా కవి, కళాకారుడే కాక, కళాపోషకుడు.ఆదిభట్ల నారాయణదాసు, తిరుపతి వేంకటకవులు, కొప్పరపు కవులు మొదలైన నాటి మహామహులందరూ దాసు శ్రీరాములుగారి అద్భుతమైన ఆతిథ్యాన్ని పొందినవారే. ఒకరకంగా చెప్పాలంటే, నాటి కవి పండిత ప్రముఖులందరికీ ఆయనంటే ఎంత గౌరవమో, అంత భయం కూడా ఉండేది. ఆయన ముట్టని విద్య లేదు. ఆ ప్రతిభకు అందరూ దాసులే. వారి ఇల్లు లక్ష్మీ సరస్వతీ నివాసం.వారు ఆగర్భ శ్రీమంతులు, ఆగర్భ కవితావతంసులు. న్యాయవాదులందరూ న్యాయవిద్యా కోవిదుడుగా చెప్పుకునేవారు. సంగీతమూర్తులెల్లరూ సంగీతసరస్వతిగా భావించేవారు. కవులంతా మహాకవి అని పూజించేవారు. మిగిలినవారంతా సంఘసంస్కర్తగా నీరాజనాలు పలికేవారు. పాత్రికేయులు విశేష పాత్రికేయునిగా భావించి విశిష్టస్థానాన్ని ఇచ్చేవారు.దాసు శ్రీరాములు అనగానే శ్రీదేవీభాగవతం, తెలుగునాడు అనే రచనలు సాహిత్యలోకంలో చాలా ప్రసిద్ధం.'తెలుగునాడు' పద్యకావ్యంలో బ్రాహ్మణులలోని వివిధ శాఖల, ఉపశాఖల గురించి చేసిన వర్ణనలు తెలుగు సాహిత్య చరిత్రలోనే తలమానికం. ఒక్కొకరు ఏ విధంగా ప్రవర్తించేవారు, వారి వృత్తులు,మానసిక ప్రవృత్తులు కళ్లకు కట్టినట్లు అభివర్ణించారు. దాన్ని గొప్ప సామాజిక శాస్త్ర గ్రంథంగా చెప్పవచ్చు. వాడిన భాష, ఆ పదబంధాలు పరమ చమత్కార శోభితాలు.'దేవీభాగవతం' దీనికి పూర్తి విరుద్ధమైన శిల్పంతో నడిచిన గ్రంథరాజం.ప్రౌఢ రచనతో పాటు, తెలుగుపలుకుబళ్ళు సెలయేరులై పారేవి.సంగీతలోకంలో వీరి స్థానం విలక్షణమైంది. ఎన్నో జావళీలు, కృతులు, పదములు, స్వర జతులు, తిల్లానాలు రచించి సంగీతలోకాన్ని ఆనంద సంద్రంలో మునకలు వేయించారు.తన సంగీత రచనలను తోట్లవల్లూరు శ్రీ వేణుగోపాలస్వామికి అంకితం చేశారు.నాట్యశాస్త్రాన్ని కూడా అభ్యసించారు. "అభినయ దర్పణం" అనే అపురూపమైన గ్రంథాన్ని రచించారు.ఆయుర్వేద శాస్త్రాన్ని కూడా మథించి 'భృంగరాజ మహిమము' అనే పరిశోధనా

## (1864 - 1908)

గ్రంథరాజాన్ని నిర్మించారు. కందుకూరి వీరేశలింగం – గురజాడ అప్పారావు – దాసు శ్రీరాములు సమకాలీకులు. వీరిలో గురజాడ కాస్త చిన్నవారు. మొదట్లో కందుకూరివారి విధానాలను కొన్నింటిని వ్యతిరేకించినా, తర్వాత ఆమోదించారు. దాసు శ్రీరాములు "అనల్ప జల్పితా కల్పవల్లి" అనే పత్రికను కూడా నడిపారు. దీని ద్వారా ఎన్నో సంఘసంస్కరణలకు బహుళ ప్రాచుర్యం కల్పించారు. ముఖ్యంగా స్త్రీజనోద్ధరణ.స్త్రీవిద్యను ప్రోత్సహించడం,భర్తలను కోల్పోయినవారికి తిరిగి పెళ్లిళ్లు చేయడం,బాల్యవివాహాలను వ్యతిరేకించడం మొదలైనవి దాసుగారి సంఘ సంస్కరణలో ముఖ్యమైన అంశాలు. స్త్రీల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు కూడా స్థాపించారు.వారి సమస్యలకు న్యాయం జరిగేవరకూ న్యాయ పోరాటం చేసేవారు. న్యాయశాస్త్రంతో పాటు ధర్మశాస్త్రం, జ్యోతిష్యశాస్త్రంలోనూ అపారమైన జ్ఞానాన్ని సంపాయించారు.నన్నయ్యను 'రెండవ వాల్మీకి'గా విశ్వనాథ సత్యనారాయణ అభివర్ణించారు. దాసు శ్రీరాములును ' రెండవ శ్రీనాథుడు' గా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి అభివర్ణించారు. అదీ, మహాకవిగా దాసు శ్రీరాములు గొప్పతనం.ఎన్నో శతకాలు, ప్రబంధాలు, పురాణాలు, నాటకాలు, కృతులు, జావళీలు, తిల్లానాలు రాసి తెలుగుజాతికి గొప్ప సారస్వత సంపదను కానుకగా ఇచ్చిన మహనీయుడు. ఏలూరులో తను నివసించిన ఇల్లు తర్వాత " గాంధీ ఆంధ్ర జాతీయ మహావిద్యాలయం"గా మారింది. నూటికో కోటికో జన్మించే అరుదైన ప్రజ్ఞామూర్తి దాసు శ్రీరాములు గారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ ఘనుడు మన తెలుగువాడు కావడం మన సౌభాగ్యం.

–మాశర్మ

## ఆశపడే ఆశయాలు

ఓ..యువ లోకమా..!
శ్వాస ప్రాణాల్ని నిలబెడితే
ఆ ప్రాణాల్ని కొనసాగించేదే ఆశయం.!
ఆశయాన్ని శ్వాసగా తీసుకున్నవారే.,
విజయ సోపానాల్ని అధిరోహించి
కాల చరిత్రలో చెరగని ముద్ర వేసేది!
ఎందరో మహానుభావుల ఆశయసాధనా
సౌధాల్లోనే మనమంతా నిశ్చింతగ నిద్రించేది!
త్యాగధనుల ఆశయాల్ని ఆదర్శంగా ఆహ్వానించి సాగిస్తే జనసంద్రం
శాంతి తీరాన్ని ముద్దాడెను!
ఆశపడే ఆశయాలే మానవ మనుగడకు
చెరుకుగడలై మాధుర్యాన్ని పంచేను..!
ఓ..యువ లోకమా..!
ఆశయం లేని జీవితం అర్థరహితం!
మనలోని నిరాశల్ని వదిలి మనవైన ఆశయాల్ని ఆదరించి ఉద్ధరించే
దిశగా అడుగులేద్దాం!
సరైన ఆవేశాలతో సరికొత్త ఆశయాలతో
విజయ సోపానాల్ని అధిరోహించేందుకు
ప్రగతి పథంలో జగతి రథంతో
పదండి ముందుకు దండిగా!
కదలండి ముందుకు నిండుగా!

– డా.పసుపులేటి నాగమల్లిక, రామచంద్రపురం.



## మంచి మాట



నిరంతరం వెలిగే సూర్యున్ని చూసి
చీకటి పారిపోతుంది.
నిర్విరామంగా శ్రమించే వ్యక్తిని చూసి
ఓటమి భయపడుతుంది.

# మైక్రోపాలియోంటాలజీలో రారాజు డా.డి.ఎస్.ఎన్.రాజు



మైక్రోపాలియోంటాలజీలో అపారమైన అనుభవాన్ని సంపాదించుకొని అంతర్జాతీయంగా గుర్తింపు సాధించిన దివంగత డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు గోదావరి ప్రాంత వాసి కావడం మనకెంతో గర్వకారణం. ప్రపంచవ్యాప్తంగా అతి సూక్ష్మ శిలాజాలలను అధ్యయనం చేసి అతి తక్కువ మంది శాస్త్రవేత్తలు డి.ఎస్.ఎన్ రాజు ఒకరు. దివంగత డా.ఎస్.ఎన్.రాజు గౌరవార్థం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలో ఫెలోషిప్ ఏర్పాటు చేసాం, కార్పస్ మనీని భారీ విరాళంగా ఇచ్చారు. డా.డీఎస్ఎన్ రాజు గౌరవార్థం ఈ బహుమతిని 'డా.దాట్ల సూర్యనారాయణ రాజు ఎండోమెంట్ అవార్డ్' అని పిలుస్తారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ డా.డి.ఎస్.ఎన్.రాజు భార్య డి.సత్యవతి, స్నేహితులు చేస్తున్న కార్యక్రమం అభినందనీయం. విద్యార్థులు డి.ఎస్.ఎన్.రాజును స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

**ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉపకులపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**

## డా.డి.ఎస్.ఎన్.రాజు విద్యార్థులకు మార్గదర్శి



ఓ.ఎన్.జి.సి. లో ఉద్యోగ విరమణ అనంతరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియో సైన్సెస్ విభాగం విద్యార్థులకు ఎన్నో ప్రాజెక్టులకు మార్గనిర్దేశం చేశారు. జియో సైన్సెస్ లో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి ఉన్నత ఉద్యోగాలలో వారిని నిలిపేందుకు కృషి చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఎంతో వివరణాత్మకంగా చాలా క్లిష్టమైన అంశాలను కూడా చాలా సులభంగా విద్యార్థులకు వివరించడంలో ఆయనకు ఆయనే సాటి. విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థుల ఉన్నతి కోసం పాటుపడే మహనీయుడు డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు. ఆయన పేరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియో సైన్సెస్ విభాగంలో ఎండోమెంట్ అవార్డ్ ఏర్పాటు చేయడం హర్షణీయం.

**ఆచార్య వై.శ్రీనివాసరావు**
**జియోసైన్సెస్ విభాగం,**
**ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం**




## జియోసైన్సెస్ విభాగంలో డి.ఎస్.ఎన్.రాజు కార్యక్రమాలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ జియోసైన్సెస్ విభాగంలో దివంగత డాక్టర్ డి.ఎస్.ఎన్. రాజు భార్య డి.సత్యవతి మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. డా.దాట్ల సూర్యనారాయణ రాజు ఎండోమెంట్ అవార్డును ఏర్పాటు చేసారు. ఎమ్మెస్సీలో స్ట్రాటిగ్రఫీ మరియు పాలియోంటాలజీ సబ్జెక్టులో ప్రథమ , ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఈ ఫండ్ నుంచి వచ్చే వడ్డీని అందజేస్తాం. ప్రతి సంవత్సరం ఫండ్ కంట్రిబ్యూటర్లలో ఒకరు లేదా డిపార్ట్మెంట్ లోని ప్రముఖ భూవిజ్ఞాన శాస్త్రవేత్త ద్వారా డాక్టర్ రాజు ఎండోమెంట్ ఉపన్యాసం , అవార్డు ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తాం.

**డా. కె.నూకరత్నం**
**జియో సైన్సెస్ విభాగాధిపతి**

## డా.డి.ఎస్.ఎన్.రాజు విద్యార్థులకు ప్రాధాన్యత



కుటుంబ సభ్యులతో సమానంగా విద్యార్థులకు దివంగత డాక్టర్ డి ఎస్ ఎన్ రాజు ప్రాధాన్యత ఇచ్చేవారు. భారతదేశంలో ఆయా ప్రాంతాల్లో ఉద్యోగం చేసినప్పుడు మరియు ఉద్యోగ విరమణ అనంతరం కూడా విద్యార్థులకు వర్క్ నేర్పిస్తూ ఉండేవారు. ఒత్తిళ్లకు గురి కాకుండా విద్యార్థులు సౌకర్యంగా విద్యాభ్యాసం పూర్తి చేయడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం, ఉద్యోగాల్లో స్థిరపడటం వంటి విజయాలను సాధించాలని కోరుకునేవారు. సమాజాన్ని కుటుంబంగా భావించి ముందుకు సాగారు. నిత్యం సమాజానికి క్రొత్త విషయాలను అందించాలని ఆయన చేసిన ప్రయత్నాలు చాలావరకు సఫలమయ్యాయి. ఎన్నో మెరుగైన పరిశోధనలు సమాజానికి అందించారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఎండోమెంట్ అవార్డు ద్వారా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు కొంత ప్రోత్సాహం అందుతుందని భావిస్తున్నాం.

**డి.సత్యవతిరాజు, డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు భార్య**

## డెడికేషన్‌లో ఆయనే రాజు



అంకితభావంతో పని చేయడంలో డి.ఎస్.ఎన్ రాజుకు సాటి ఎవరూ లేరు. చిరకాలంగా ఆయనతో స్నేహం ఉన్నప్పటికీ చివరి కాలంలో ఆయనతో కలిసి పని చేయడానికి అవకాశం దక్కింది. అంతర్జాతీయంగా GTS ఫౌండేషన్ ద్వారా INDPLEX ప్రాజెక్టులో ఆయనతో కలిసి పని చేసాను. నాలాంటి వారి అనేకమంది రాజు దగ్గర అనేక విషయాలు నేర్చుకున్నాము. భారత దేశ వ్యాప్తంగా ఉన్న 26 సెడిమెట్రిక్ బేసెన్స్ లో పూర్తిగా అధ్యయనం చేసి 90% వర్క్ ను పూర్తి చేశారు. రాజు కాలం చేసిన తర్వాత మిగిలిన వర్క్ పూర్తి చేశాం, త్వరలో అది అందుబాటులోకి వస్తుంది. డాక్టర్ డి ఎస్ ఎం రాజు పేరుతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎండోమెంట్ అవార్డు ఏర్పాటు చేయడానికి సహకరించిన వీసీ జగన్నాథరావు, రిజిస్ట్రార్, స్నేహితులందరికీ ధన్యవాదాలు.

**డా.ఎ.నల్లపరెడ్డి, డాక్టర్ డి ఎస్ ఎన్ రాజు స్నేహితులు**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in